## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హన్మకొండ:** హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నయీంనగర్, లష్కర్ సింగారం, రాజాజీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, కిషన్‌పుర, లష్కర్ బజార్, సిక్‌వాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హంటర్ రోడ్డు, కనకదుర్గ కాలనీ, వాసవి కాలనీ, ఆంజనేయ స్వామి దేవస్థానం, టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



**ఖిలా వరంగల్:** స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ కమిటీని నగరంలో సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కల్వచెర్ల హనుమంతరావు, అధ్యక్షుడిగా వలబోజు సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా వేల్పుల రవీందర్, టి.సరస్వతి, ఎం.రత్నం, కార్యదర్శులు సమ్మెట భద్రయ్య, హైమావతి, లక్ష్మీనారాయణ, సలహాదారుగా బెల్లంకొండ రమేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు కర్రు సుధీర్‌బాబు, సదానందం, తుమ్మ వీరయ్య, సభ్యులు వనజ, సాంబయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

### రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సూర్యనారాయణ



**ఖిలా వరంగల్:** తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎడ్ల సూర్యనారాయణను నియమించినట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన వారికి సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

### గోరింటాకు వేడుకలు



**కాజీపేట అర్బన్:** హంటర్‌రోడ్డులోని ఆకృతి అపార్ట్‌మెంట్‌లో గోరింటాకు వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాఢంలో ప్రకృతిలో వచ్చే మార్పులకనుగుణంగా తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆరోగ్య సంజీవనిగా పేరుగాంచిన గోరింటాకు తమకెంతో ఇష్టమని అన్నారు. ఆషాఢం స్పెషల్‌గా తొలిసారి గోరింటాకు వేడుకలను తమ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్నట్లు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరువరంగం ప్రభాకర్ తెలిపారు.

### నిధులు మంజూరు చేయాలి

**హన్మకొండ:** 59వ డివిజన్ పరిధి హనుమకొండ ఎక్సైజ్ కాలనీలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత కోరారు. ఈ మేరకు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ని కార్పొరేటర్ సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. ఎక్సైజ్ కాలనీలో మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాలని, రాజీవ్ పార్కు వాకింగ్ ట్రాక్ పునర్నించాలని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలైన భవాని నగర్, స్నేహ నగర్‌లో చేపడుతున్న డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు.

### ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



**కాజీపేట రూరల్:** కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ బూడిదిగడ్డ, భవానినగర్, బోడగుట్టలో ఐదు ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో షేక్ అజ్గర్, సిరిల్ లారెన్స్, దొంగల కుమార్‌యాదవ్, మధు, ఏరియా ఫీల్డ్ ఆఫీసర్ శ్రీశైలం, లంకేష్ యాదవ్ పాల్గొన్నారు.

### పర్యావరణాన్ని పరిరక్షించాలి

**హన్మకొండ:** ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సీమ సూచించారు. గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీ చైతన్య స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీమ మాట్లాడుతూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కలు నాటగానే సరిపోదని వాటిని సంరక్షించాలని కోరారు.

# సమస్యలతో సతమతం

- బాలాజీనగర్‌లో ధ్వంసమైన రోడ్లు
- నిరుపయోగంగా మినీ వాటర్ ట్యాంక్
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నిరుపయోగంగా ఉన్న స్టాటిక్ ట్యాంక్



బాలాజీనగర్‌లో ధ్వంసమైన సీసీ రోడ్డు

**కాజీపేట రూరల్:** కాజీపేట 47వ డివిజన్ బాలాజీనగర్ ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాజీపేట మెయిన్‌రోడ్డు నుంచి బాలాజీనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు ధ్వంసమై అధ్వానంగా తయారైంది. బాలాజీనగర్‌లోని పలు కాలనీల్లోని అంతర్గత రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురుగు నీరు నిలుస్తోంది. కాలనీ ప్రజల కోసం ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంటోంది. దాంతో నల్లాల ద్వారా నీరు రానప్పుడు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. స్టాటిక్ ట్యాంక్ చుట్టూ, డ్రెయినేజీల్లో పిచ్చిమొక్కలు పెరిగాయని చెబుతున్నారు. వర్షాకాలంలో బాలాజీనగర్‌లో కొన్ని కాలనీల్లో మట్టి రోడ్లు బురదమయంగా మారుతున్నాయి.

### సమస్యలు పరిష్కరించాలి



బాలాజీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. మెయిన్ రోడ్డు వద్ద నుంచి పలు కాలనీలకు వెళ్లే అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయి. డ్రెయినేజీల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో మురుగు నీరు ముందుకు సాగడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

- పప్పుల గోవర్ధన్, స్థానికుడు

### ట్యాంక్‌ను ఉపయోగంలోకి తేవాలి



బాలాజీనగర్‌లో నిరుపయోగంగా ఉన్న స్టాటిక్ ట్యాంక్‌ను ఉపయోగంలోకి తేవాలి. మున్సిపల్ నల్లాల ద్వారా నీరు రానప్పుడు స్టాటిక్ ట్యాంక్‌లోని నీరు ఉపయోగపడేది. అది ఇప్పుడు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ధ్వంసమైన రోడ్లు, డ్రెయినేజీలకు మరమ్మతులు చేయాలి.

- ఎం.ధన్‌రాజ్, స్థానికుడు

## విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

**కేయూ క్యాంపస్:** రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు అనేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువులు పూర్తయినప్పటికీ ఒరిజినల్ సర్టిఫికెట్లు తెచ్చుకునే ఆర్థిక స్తోమత లేక విద్యార్థులు తమ ఉన్నత విద్యను మధ్యలోనే వదిలేయాల్సి పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అనేక రకాల ఫీజులు వసూళ్లు చేస్తుంటే అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేష్, రాష్ట్ర నాయకురాలు కావ్య, గ్రేటర్ వరంగల్ కమిటీ అధ్యక్షుడు వినయ్, కార్యదర్శి వంశీ, జిల్లా నాయకులు శ్రీజ, సాధన, సాత్విక, సౌమ్య, మమత, విఘ్నేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

### గవర్నర్‌ను కలిసిన సీపీ



**వరంగల్ క్రైం:** కాకతీయ యూనివర్సిటీలో సోమవారం జరిగిన స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు కాజీపేట నిట్ కళాశాల అతిథి గృహానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కమిషనరేట్ పోలీసింగ్ పనితీరును సీపీని గవర్నర్ అడిగి తెలుసుకున్నారు.

### బంగారు పతకాలు అందుకున్న ఎల్‌బీ విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

**రామన్నపేట:** కాకతీయ యూనివర్సిటీలో సోమవారం జరిగిన 23వ స్నాతకోత్సవంలో నగరంలోని లాల్ బహదూర్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. షాజియా అంజుమ్, అనిల్, సామానుస్టీన్, రేవతి, సుష్మాబాబ్లీ, శ్రీలేఖ, ప్రవళిక, కాథూన్ వివిధ విభాగాల్లో బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

## కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న పెంటయ్య

**వరంగల్ చౌరస్తా:** సీసీఐ పత్తి కొనుగోళ్ల విషయంలో మార్కెట్ యార్డుల్లోనే పీడీపీఎస్ ద్వారా బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేస్తామనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ, ఉమ్మడి వరంగల్ జిల్లా అడ్తి అండ్ కమిషనర్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కటకం పెంటయ్య తెలిపారు. వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెంటయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి, చాంబర్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ప్రతినిధులు మొగిళి చంద్రమౌళి మాట్లాడారు. గతంలో 10 బస్తాలు, 20 బస్తాల పత్తి తీసుకొస్తే కొనుగోళ్లను సీసీఐ నిరాకరించేదని, దాంతో చిన్నకారు రైతులు గిట్టుబాటు ధర పొందలేక నష్టపోయారని పేర్కొన్నారు. కొత్త విధానంతో తక్కువ పత్తి బస్తాలు తెచ్చే రైతులకు కూడా లాభం చేకూరుతుందని తెలిపారు. తెలంగాణలో మార్కెట్ వ్యవస్థ, అడ్తీ వ్యవస్థ పటిష్టంగా ఉందని వివరించారు. ఈ నిర్ణయం వల్ల అడ్తీదారుల ఆగడాలు పెరుగుతాయని కొంతమంది దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## 'వర్కర్ల'ను ఆర్టిజన్లుగా గుర్తించాలి



అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లతో శ్రీధర్

**హన్మకొండ:** అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్లుకు గుర్తించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)-327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ డిమాండ్ చేశారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని టీఎస్ఈఈయూ-327 కార్యాలయంలో ఇనుగాల శ్రీధర్‌తో పాటు ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డిని వివిధ జిల్లాల అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు సోమవారం కలిసి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్స్ ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు కుర్రి సుధాకర్, కార్యదర్శి నందిపాటి వెంకన్న మాట్లాడుతూ అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్ ఉద్యోగులుగా గుర్తించాలని, చనిపోయిన ఆర్టిజన్ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని, రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, జేఎల్ఎం నియామకాల్లో వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబానికి హెల్త్‌కార్డు ఇవ్వాలని కోరారు. పాండు, గంగన్న, డేగ రవి, వెంకన్న, భిక్షపతి, రంగన్న, రఫీ, భద్రు పాల్గొన్నారు.

## జీఓ 282 ఉత్తర్వులు రద్దు చేయాలి



జీఓ కాపీలను దహనం చేస్తున్న నాయకులు



5వ డివిజన్‌లో దహనం చేస్తున్న నాయకులు

**హన్మకొండ అర్బన్:** రాష్ట్రంలో పనిగంటల పరిమితిని 8 గంటల నుంచి 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన జీఓ నంబర్ 282 ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ కాపీలను సోమవారం దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సాంగపాణి, జక్కు రాజుగౌడ్, సీఐటీయూ జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, మహేష్, మల్లేశం, వెంకట్, రవీందర్, కుమారస్వామి, పూర్ణచందర్, పాపయ్య పాల్గొన్నారు.

**జీఓ ప్రతుల దహనం**

**హన్మకొండ చౌరస్తా:** కార్మికుల పనిగంటల వ్యవధిని పెంచుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కోశాధికారి యాస బాబు డిమాండ్ చేశారు. హనుమకొండలోని 5వ డివిజన్‌లో మున్సిపల్ కార్మికులతో కలిసి జీఓ ప్రతులను సోమవారం దహనం చేశారు.

## 'సెయింట్ పీటర్స్'కు బంగారు పతకాలు



బంగారు పతకాలు చూపుతున్న విద్యార్థులు

**హన్మకొండ:** హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు బంగారు పతకాలు, పీహెచ్‌డీ అవార్డులను రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. కాకతీయ యూనివర్సిటీలో సోమవారం జరిగిన వర్సిటీ స్నాతకోత్సవంలో సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాలకు చెందిన కె.అఖిల రెండు బంగారు పతకాలు, పి.హిమవర్షిణి, మెహరీన్ ఫాతిమా, ఓ.స్వాతి, ఎ.శ్రావ్య, వైన్య సుల్తానా బంగారు పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను కళాశాల చైర్మన్ టి.జయపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజశ్రీ, అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

# 'పెట్టుబడిదారులకు ఏజెంట్‌గా మోదీ'



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**హన్మకొండ చౌరస్తా:** ప్రధాని మోదీ పెట్టుబడిదారులకు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ కార్మికులకు నష్టం చేసే చట్టాలను తెస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ఈ మేరకు హనుమకొండలోని వేయిస్తంభాల గుడి నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం నిర్వహించిన బైక్ ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకునే నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న పాత చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కూర వెంకట్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజుగౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, వివిధ కార్మిక సంఘాల బాధ్యులు ఉప్పలయ్య, చక్రపాణి, సారంగపాణి, ధర్మరాజు, పూర్ణచందర్, మైముదా, వీరన్న, వెంకట్ పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో మరింత భద్రత



మాట్లాడుతున్న అంకిత్‌కుమార్

- ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

**న్యూశాయంపేట:** కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల మరింత భద్రత లభిస్తుందని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ అన్నారు. 14వ డివిజన్ ఏనుమాముల ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1 మునలమ్మ కుంటలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ప్రజల భద్రతకు, నేరాల నియంత్రణకు ఉపయోగపడతాయని అన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సై రాజు, ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొలుసుల సంతోష్, బండ్ల సురేందర్, వెన్నెం రాజనర్సు, కొండా సదానందం, ఠాగూర్ సంధ్యారాణి, సరళ, కొండా ప్రమీల, మహబూబితో పాటు కాలనీ వాసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చందా మల్లయ్య

**నయీంనగర్:** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ చందా మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించడానికి కనీస వసతులైన మూత్రశాలలు, తాగునీరు, భవనాలు, ప్రయోగశాలలు, ఉపాధ్యాయులు ఉండే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. బీసీ విద్యార్థులందరికి 10వేల ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ త్వరగా విడుదల చేయాలని చందా మల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మేకల సుమన్, రాజన్న నాయక్, రవీందర్, రత్నాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు సేవ చేయాలి

**హన్మకొండ:** సమాజంలో అట్టడుగున ఉన్న పేదలకు సేవ చేయాలని రోటరీ క్లబ్ పీడీజీ తాళ్ల రాజశేఖర్ రెడ్డి సూచించారు. హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ అధ్యక్షుడిగా బేతి రవీందర్ రెడ్డి, కార్యదర్శి గంగోజుల నరేష్, కోశాధికారిగా మిరియాల రాజ్ కుమార్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బేతి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తనకు సమాజానికి సేవ చేసే అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో శరత్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### 'మలేరియా కార్మికుల'కు పెరిగిన వేతనం

**వరంగల్ అర్బన్:** బల్దియా అర్బన్ మలేరియా విభాగం దినసరి కార్మికుల వేతనాలు పెంచుతూ కౌన్సిల్‌లో సోమవారం తీర్మానించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. 90 మంది కార్మికులు ప్రస్తుతం రూ.12,800 వేతనం అందుకుంటున్నారు. ఆ వేతనాన్ని సవరిస్తూ రోజుకు రూ. 651గా చెల్లించేందుకు అంగీకరించడ పట్ల మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుకు కార్మికులు పుష్పగుచ్ఛాలు అందజేసి, ధన్యవాదాలు తెలిపారు.

### సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

**హన్మకొండ:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వరంగల్ రీజియన్ కార్యదర్శి బి.ఉపేంద్రచారి పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ -1 డిపో వద్ద కరపత్రాలను ఆర్టీసీ జేఏసీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు ఎల్లయ్య, బి.సంపత్, ఎండీ.పాషా, ఎస్.ఆర్.కుమార్, దయానా, అరుణకుమారి, భద్రజ, కవిత, రమాదేవి, ఆర్‌కె.స్వామి, రమేష్ పాల్గొన్నారు.

### సమ్మెకు టీఎంకేఎంకేఎస్ మద్దతు

**న్యూశాయంపేట:** కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్పొరేట్, మతోన్మాద విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం హనుమకొండ జిల్లా కమిటీ తెలిపింది. ఈ మేరకు హనుమకొండలో కమిటీ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో నాయకులు గొడుగు వెంకట్, విజేందర్, దుర్గయ్య, మల్లయ్య, రవి, పి.రవి, పవన్, నర్సయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**హన్మకొండ:** ములుగులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకులను పోలీసులు సోమవారం ముందుస్తుగా అరెస్టు చేశారు. జిల్లా వ్యాప్తంగా ముఖ్య నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. ఇందిరమ్మ ఇళ్లు కావాలని కోరిన రమేష్‌ను ఆత్మహత్య చేసుకునేలా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ధర్నాకు పిలుపునిచ్చింది. అలాగే, కాకతీయ యూనివర్శిటీ స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ వర్మ రానున్న క్రమంలో హనుమకొండలో బీఆర్ఎస్, బీఆర్ఎస్ విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ నాయకులు జోరిక రమేష్, బొల్లికొండ వీరేందర్, పోలపల్లి రామ్మూర్తి, గుగులోతు రాజేష్‌నాయక్, గంద్రకోట రాకేష్ యాదవ్, స్నేహిత్‌ను సుబేదారి పోలీస్ స్టేషన్‌కు, బీఆర్ఎస్వీ నాయకులు బైరపాక ప్రశాంత్, పస్తం అనిల్, నరేందర్‌ను అరెస్టు చేసి హనుమకొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

### ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లకు శుభాకాంక్షలు

**హన్మకొండ:** టీజీ ఎన్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతి రెడ్డి, ఆపరేషన్ డైరెక్టర్ టి.మధుసూదన్‌ను తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీపీఈఏ) సోమవారం నాయకులు కలిశారు. ఇటీవల నూతన డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారిని తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వంగ రవీందర్, టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు ఆర్.పాండు, అసోసియేట్ ప్రెసిడెంట్ టి.శంకరయ్య, అడిషనల్ జనరల్ సెక్రటరీ బి.సుధాకర్, ఆయా జిల్లాల నాయకులు వేర్వేరుగా కలిసి మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

**మడికొండ:** విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని కుడా మాజీ చైర్మన్, మాస్టర్జీ విద్యాసంస్థల చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. మడికొండలోని మాస్టర్జీ పాఠశాల ఆవరణలో స్టూడెంట్ కౌన్సిల్ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు. స్టూడెంట్ కౌన్సిల్ హెడ్ గర్ల్‌గా ముక్తి, హెడ్ బాయ్‌గా ఎన్నికైన మల్లేశ్వర్‌లతో పాటు విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షీలో, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఏఓ రమేష్‌బాబు, సుధాకర్, మహేష్, సంగీత పాల్గొన్నారు.

### ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

**వరంగల్ చౌరస్తా:** ద్విచక్ర వాహనం అజాగ్రత్త నడిపి ప్రమాదానికి గురైన ఘటనలో ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడని ఇంతేజార్ గంజ్ పోలీసులు తెలిపారు. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన సాయికృష్ణ తన స్నేహితుడు పిన్న సాయికుమార్(26) కలిసి ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. సాయికృష్ణ అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడపడంతో వెనుక సీటులో ఉన్న సాయికుమార్ హంటర్ రోడ్డులో డ్రెయినేజీలో పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న సాయికుమార్‌ను ఎంజీఎంకు తరలించారు. అనంతరం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

**మడికొండ:** చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని బోడగుట్టలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోడగుట్ట ప్రాంతానికి చెందిన నాయిని రాజు (39) వారం క్రితం కూల్ డ్రింక్ తాగి అస్వస్థతకు గురయ్యాడు. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తల్లి నాయిని సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

### ఎఫ్ఆర్ఎస్ పనితీరుపై ఆరా

**విద్యారణ్యపురి:** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ (ముఖ హాజరు) పనితీరుపై రాష్ట్ర టెక్నీషియన్ల బృందం ఆరా తీసింది. ఎఫ్ఆర్ఎస్‌లో తలెత్తుతున్న సమస్యలను గుర్తించేందుకు హనుమకొండ జిల్లాలోని పలు పాఠశాలలను టెక్నీషియన్లు సందర్శించారు. విద్యార్థుల రిజిస్ట్రేషన్ ఎలా చేయాలి, హాజరు ఏ విధంగా నమోదు చేయాలనే అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఉప ప్రణాళిక సమన్వయ కర్త రఘుచందర్ రావు పాల్గొన్నారు.

## ఘనంగాఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకలను నగరవ్యాప్తంగా సోమవారం నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల మాదిగ లాయర్స్ ఫెడరేషన్ (ఎంఎల్ఎఫ్) అధ్యక్షులు కొంగర పూర్ణచందర్, గోవింద్ నాగభూషణం ఆధ్వర్యంలో, కేయూ రిజిస్టర్ రామచంద్రం ముఖ్యఅతిథిగా పాల్గొనగా, కేయూ మొదటి గేటు వద్ద, కాజీపేట చౌరస్తాలో నాయకుడు తిప్పారపు మల్లేష్‌మాదిగ, న్యూశాయంపేటలో జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, హసన్‌పర్తిలో వ్యవస్థాపక సభ్యుడు బొట్ల భిక్షపతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్